# అన్యాయం

## సస్పెన్షన్‌పై విపక్షాల ఆగ్రహం

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా అద్దంకి శాసనసభ్యుడు కరణం బలరాం (తెదేపా)ను ఆరునెలలపాటు సభ నుంచి సస్పెండ్ చేయడం అన్యాయమని తెరాస, సీపీఎం, సీపీఐ, భాజపా తీవ్రంగా ఖండించాయి. ఇది పూర్తిగా అప్రజాస్వామికమైన, దురదృష్టకరమైన చర్యగా పేర్కొన్నాయి. మంగళవారం మధ్యాహ్నం సభ వాయిదాపడ్డాక తెరాస ఎమ్మెల్యే నగేశ్, సీపీఎం, సీపీఐ, భాజపా పక్ష నేతలు నోముల నరసింహయ్య, చాడ వెంకటరెడ్డి, జి.కిషన్‌రెడ్డిలు విడివిడిగా మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

### తెరాస రెబెల్స్‌పై చర్యలేవీ: నగేశ్

శాసనసభలో సభాపతి స్థానం గౌరవప్రదమైనదే. దానిని అందరం కాపాడాలి. అయితే నిండు సభలో తోటి సభ్యుడిని సస్పెండ్ చేయడం దురదృష్టకరం. పాలకులు పనిగట్టుకునే ఈ పని చేశారు. తెరాస తరపున ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు విప్‌ను ధిక్కరించి పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారని, తెలంగాణ ప్రజలకు ద్రోహం చేశారంటూ గతంలో ఫిర్యాదు చేశాం. ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంత చిత్తశుద్ధే ఉంటే... తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన తెరాస తిరుగుబాటు ఎమ్మెల్యేలపై చర్య తీసుకుని కఠినంగా శిక్షించాలి. పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించి మరీ బలరాంను సస్పెండ్ చేశారు. ఆ వార్తల క్లిప్పింగుల విశ్వసనీయతను కనీసం ప్రశ్నించలేదు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన పనే. సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తూ ఇచ్చిన నివేదికకు, బలరాం ఇచ్చిన నివేదికకు మధ్య ఎంతో వ్యత్యాసముంది. తన వాదన వినిపించడానికి ఆయనకు సమయమివ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. (సభాపతిపై తెదేపా అభిశంసన తీర్మానం ప్రవేశపెడితే బలపరుస్తారా అని అడుగగా.. 'దీనిపై మా కోణంలో మేం పోరాడతాం' అని నగేశ్ బదులిచ్చారు)

### ఇది చట్టవ్యతిరేక చర్య: నోముల

సభాపతితో పాటు సభ్యులందరి గౌరవాన్ని పెంచే వేదికగా శాసనసభ ఉపయోగపడాలి. కానీ బలరాంపై చర్యకు ప్రవేశపెట్టిన తీర్మానం అందుకు భిన్నంగా ఉంది. ప్రతిపక్ష నేతల అభిప్రాయాలు కూడా తీసుకోకుండా ఏకపక్షంగా ఆయన్ను సస్పెండ్ చేయడం సరైన పద్ధతి కాదు. బలరాం సస్పెన్షన్ చట్టానికి వ్యతిరేకంగా ఉంది.

### గర్హనీయం: సీపీఐ

బలరాం సస్పెన్షన్‌కు తీర్మానం ప్రవేశపెట్టిన తీరు అప్రజాస్వామికంగా ఉంది. సభ సంప్రదాయాలు పాటించలేదు. ప్రతిపక్ష నేతల అభిప్రాయాలు తీసుకోలేదు. ఈ అంశంపై సీపీఎం నేత నోముల మాట్లాడేందుకు కుతూహలమ్మ అవకాశమిచ్చినా.. పాలకపక్షం ఆమె నిర్ణయాన్ని అడ్డుకుని ఏకపక్షంగా తీర్మానాన్ని ఆమోదించడం గర్హనీయం. తెదేపా అభిశంసన తీర్మానం ప్రవేశపెడితే ఏం చేయాలో మా పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

### ప్రభుత్వం తొందరపడింది: భాజపా

బలరాం సస్పెన్షన్‌కు సంబంధించి సర్కారు తొందరపడింది. సభాహక్కుల సంఘం నివేదికే అంతిమం కాదు. అందులో భాజపా, సీపీఐ, ఎంఐఎంలకు ప్రాతినిధ్యం లేదు. సంఘం సిఫార్సులపై చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుండేది. ఆఖరు నిమిషంలో తీర్మానం ప్రవేశపెట్టి ఆదరాబాదరాగా వాళ్లకు వాళ్లే (కాంగ్రెస్) ఆమోదించేసుకోవడం మంచి పరిణామం కాదు.